సామెత (జాతీయముల )కథలు

# మేకపోతు గాంభీర్యము

**- శ్రీ ముసునూరి లక్ష్మీగణపతిశాస్త్రి.**

ఒక అడవిలో అదుపూ ఆజ్ఞలేని మేకల మంద తిరుగుతూండగా ఒక మేకపోతు దారి తప్పింది. అది ప్రాణాలు అరచేత పట్టుకొని మూల మూలల నక్కుతూ తిరగడం మొదలు పెట్టింది.

ఒకనాడు ఒక చిచ్చుఱపిడుగులాంటి సింహం ఎదురై మేకపోతుతో "ఓయీ! లోకంలో తనభార్య గర్భవతియైనప్పుడు, మ్రొక్కుబడులు మిగిలియున్నప్పుడు, కార్యదీక్ష కానప్పుడు గడ్డం పెంచుతారని పెద్దలంటారు. నీవు వీనిలో ఏ కారణం చేత గడ్డం పెంచావు?" అని యడిగెను.

మేకపోతుకు పోయిన ప్రాణం తిరిగి బొందెలో ప్రవేశించినట్లయింది. తనకు సహజంగా గడ్డం ఉంటుందన్న సంగతి సింహానికి తెలియకపోవడం కేవలం తన అదృష్టమే అనుకొంది. అందుచేత ఏ మాత్రం జంకు గొంకు లేకుండా లేని గాంభీర్యం తెచ్చిపెట్టుకొని "మిత్రమా! మ్రొక్కుబడులూ కాదు. నా భార్య గర్భవతియూ కాదు. నేనొక గొప్ప కార్యం తలపెట్టాను. నీవు సఖుడవు కాబట్టి నీతో ఉన్నది ఉన్నట్లు చెప్పదలచాను. నూరు పెద్దపులులు, ఏబది ఏనుగులు, ఇరువదియైదు ఎలుగుబంట్లు, పండ్రెండు తోడేళ్ళు, ఒక్క సింహం, వీనిని చంపుకొని తిన్నట్టయితే నాకొక్క మహాయాగం సిద్ధిస్తుందని ఒక్క మహర్షి వల్ల విన్నాను. నాటినుండి ఒక్క సింహం తప్ప తక్కినవాని నన్నిటిని చంపుకొని తిన్నాను. నా అదృష్టంవల్ల నీవీనాడు నాకంట పడ్డావు, గనుక నేడే నా కార్యదీక్ష పూర్తి అవుతుందని ఆశిస్తున్నాను" అనెను. నదరూ బెదరూ లేని మేకపోతుయొక్క గంభీరధ్వని విన్న సింహం గడగడలాడిపోతూ, నోట మాటరాక వెన్నిచ్చి పరుగెత్తుకు పోయింది. తన వాక్చాతుర్యంచేత ఆపదనుండి తప్పుకొని మేకపోతు బ్రతుకుజీవుడా అంటూ తన మందలో చేరింది.

ఎవరైనా పిరికివారు లేని ధైర్యమును తెచ్చిపెట్టుకొని ఎదుటివారిని మభ్యపెట్టజూస్తే, అలాంటివారిది మేకపోతు గాంభీర్యము అని అనడం పరిపాటి.

*** ********* ***

*వచ్చే సంచికలో **ప్రత్యక్షపురాణం** గురించి తెలుసుకుందాం.*

**మన్మథబాణముల పేర్లు మీకు తెలుసా?**

1. **అరవిందము** అనగా పద్మము.
2. **అశోకము** అనగా శోకము లేనిది, అశోక వృక్షము.
3. **చూతము** అనగా మామిడి.
4. **నవమల్లిక** అనగా విరజాజి.
5. **నీలోత్పలము** అనగా నల్లకలువ.